క్లుప్తంగా

ఘనంగా బీరప్ప ఉత్సవాలు



ఎమ్మెల్యే కాలె యాదయ్యను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చేవెళ్ల: మున్సిపల్ పరిధిలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో గత రెండు రోజులుగా మల్లన్న, బీరప్ప ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఉత్సవాల్లో పాల్గొని ఆలయంలో పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, గ్రామ నాయకులు మాణిక్యరెడ్డి, రాములు, శ్రీశైలం, శామ్యుల, పాండు, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్ లింగం దంపతులు

షాబాద్: ఆధ్యాత్మికత చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని మాజీ సర్పంచ్ బోకుల లింగం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామంలో గల హనుమాన్ దేవాలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని దేవుడికి కేటాయించాలని సూచించారు. ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు ఉత్సవాలు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఉప్పరిగడ్డ మక్తలో ఉర్సు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మంగళవారం ఈ ఉత్సవాల్లో మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ పాల్గొని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హిందూ ముస్లింలు ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. పండుగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, సుమిత్రాచందునాయక్, వీరేశంగుప్తా, ముబిన్‌ఘోరి, రవిగౌడ్, శ్రీను, బాల్‌రాజ్, జహంగీర్, ఖాజా, అలీం పాషా, సత్తార్‌పాష తదితరులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పుపై బీఆర్‌ఎస్ శ్రేణుల హర్షం

కడ్తాల్: ఓబులాపురం మైనింగ్ కంపెనీ ఇనుప గనుల అక్రమ తవ్వకాల కేసులో ఎమ్మెల్యే సబితారెడ్డిని నిర్దోషిగా పేర్కొంటూ మంగళవారం సీబీఐ కోర్టు ప్రకటించడంతో మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. 2011లో సబితారెడ్డిపై నాటి ప్రభుత్వం మైనింగ్ కేసులో పాత్ర ఉన్నట్లు అభియోగం మోపిందని ఆరోపించారు. కొంచెం ఆలస్యమైనా ఏ తప్పు చేయని సబితారెడ్డి నిర్దోషిగా బయటపడ్డారన్నారు. నిరంతరం ప్రజాసేవ చేస్తున్న ఆమెను ఏ తప్పు చేయలేదని ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, మార్కెట్ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు గోవర్దన్, మహేశ్, శేఖర్, యాదయ్య ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ఇబ్రహీంపట్నం: అనారోగ్యంతో వైద్య చికిత్స చేయించుకున్న ఎల్మినేడు గ్రామానికి చెందిన శ్రీహరికి రూ.60వేలు, సత్తయ్యకు రూ.60 వేలు, శోభకు రూ.16వేలు, భారతమ్మకు రూ.16 వేలు, కిరణ్‌కు రూ.25,500లు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మంఖాల శేఖర్‌రెడ్డి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నిరంజన్‌రెడ్డి, యాదగిరి, జంగయ్య, గోపాల్, పట్నం శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ప్రాణాలకు రక్ష

- విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో భద్రతా వారోత్సవాలు
- ప్రమాదాలపై ప్రజలు, సిబ్బందికి అవగాహన
- జాగ్రత్తలు అవసరమంటున్న అధికారులు

మండలం, మున్సిపాలిటీలో కనెక్షన్లు ఇలా

కేటగిరీ	సర్వీసులు
గృహాలు	12,150
వాణిజ్యం	2,200
పరిశ్రమలు	258
వ్యవసాయం	2,150
వీధి దీపాలు	76
తాగునీటి సరఫరా	70



సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

కొత్తూరు: తరచూ జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు, వాటి నివారణ, పొదుపు పాటించడం వంటి విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విద్యుత్‌శాఖ చర్యలు తీసుకొంటుంది. ఇందులో భాగంగా టీజీఎస్పీడీసీఎల్ ఈ నెల 1 నుంచి 7వ తేదీవరకు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తూ ప్రజలు, సిబ్బందికి అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతోంది. అధికారులు, ట్రాన్స్‌కో సిబ్బంది రైతులు, ప్రజల వద్దకే వెళ్లి వారికి ప్రమాదాల తీరుపై క్షేత్రస్థాయిలోనే అవగాహన కల్పిస్తూ పలు సలహాలు, సూచనలు అందజేస్తున్నారు.

నిర్ధారించుకున్నాకే మరమ్మతులు

- ఇటీవల విద్యుత్ సంస్థ ఆన్‌లైన్ లైన్ క్లియర్(ఎల్‌సీ) విధానాన్ని తీసుకొచ్చింది. ఇందులో క్షేత్రస్థాయి అధికారికి ఎందుకోసం లైన్ క్లియరెన్స్ తీసుకుంటున్నారనే దానిపై సమాచారం ఇవ్వాలి. అనంతరం ఆపరేటర్‌కు ఆన్‌లైన్‌లోనే ఏ ఫీడర్‌కు లైన్‌క్లియర్ కావాలో తెలియజేయాలి.
- మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది, సబ్‌స్టేషన్‌లోని ఆపరేటర్లు ఫీడర్, మరమ్మతులు చేపడుతున్న వాటి ఫొటోలను పంపుకోవాలి.
- ప్రమాదాల నియంత్రణలో భాగంగా లైన్‌మెన్ లేదా సిబ్బంది మరమ్మతులు చేపట్టే స్తంభాలకు విద్యుత్ సరఫరా లేదని నిర్ధారించుకున్నాకే పనులు చేపట్టాలని అవగాహన కల్పిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వ్యవసాయ పొలాల్లో రైతులు మోటార్లు, స్టార్టర్ బాక్సులకు తప్పనిసరిగా ఎర్తింగ్ చేయించుకోవాలి. స్తంభం నుంచి మోటారుకు వచ్చే తీగకు అతుకులు లేకుండా, నేలమీద పడకుండా చూసుకోవాలి.
- ఇనుప డబ్బాలకు బదులుగా రైతులు స్టార్టర్లకు ప్లాస్టిక్ డబ్బాలు వాడడం మంచిది. వర్షాకాలంలో ముందు జాగ్రత్తగా టెస్టర్లను వెంట ఉంచుకోవడం ఉత్తమం.
- ప్రజలు, వాహనదారులు, సిబ్బంది వర్షం కురిసే సమయంలో తడిసిన స్తంభాలు, ఉపకరణాలను పట్టుకోవద్దు.
- పశువులను మేతకు తీసుకెళ్లినప్పుడు అవి ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వద్దకు వెళ్లకుండా చూసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి



విద్యుత్ విషయంలో సిబ్బంది, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యం వహిస్తేనే ప్రమాదాలు జరుగుతాయి. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా వినియోగదారులకు ప్రమాదాల తీరుపై అవగాహన కల్పిస్తున్నాం. సిబ్బంది సైతం మరమ్మతుల సమయంలో పూర్తిస్థాయి అనుమతులు పొందినట్లు నిర్ధారించుకున్నాకే స్తంభాలు ఎక్కాలి. మరమ్మతులు చేపట్టాలి.

– రమేష్‌గౌడ్, ట్రాన్స్‌కో ఏఈ, కొత్తూరు

- గాలులు, వర్షాలకు తెగిన, వేలాడుతూ, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను గుర్తిస్తే వెంటనే విద్యుత్ అధికారులు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.
- విద్యుదాఘాతానికి గురైన వారిని నేరుగా తాకకుండా తడిలేని, ప్లాస్టిక్ కర్రలతో మొదటగా తీగలను వేరు చేసి వారి దగ్గరకు వెళ్లాలి.
- ముఖ్యంగా విద్యుత్ అధికారుల అనుమతి లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు మార్చడం, కాలిన తీగలను తొలగించడం అత్యంత ప్రమాదకరం.

రిటైర్డ్ జీహెచ్‌ఎంలకు సన్మానం



రిటైర్డ్ జీహెచ్‌ఎంలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్: పట్టణంలోని శ్రీకాకతీయ టాలెంట్ స్కూల్ ఆవరణలో మంగళవారం డివిజన్ గణిత ఫోరం ఆధ్వర్యంలో రిటైర్డ్ జీహెచ్‌ఎంలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గణిత ఫోరంలో చురుకుగా పని చేసిన జీహెచ్‌ఎంలు దొంతు పాండురంగయ్య, వెంకటయ్య పదవీ విరమణ పొందిన సందర్భంగా వారికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత ఫోరం డివిజన్ అధ్యక్షుడు నర్సింలు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థులను బావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేన్నారు. అనంతరం రిటైర్డ్ జీహెచ్‌ఎంలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గణిత ఫోరం నాయకులు గణేశ్‌కుమార్, బాబుచంద్, మల్లేశ్వర్, రమామహేశ్వర్, రాంచంద్రారెడ్డి, శ్రీరాములు, శైలజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక త్వరగా పూర్తిచేయాలి

ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి



కేశంపేట: బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి బ్యాంకుల అధికారులకు కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఆయా బ్యాంకుల అధికారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ జిల్లా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 1,673 దరఖాస్తులు వచ్చినట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికపై బ్యాంక్ అధికారులకు నియమ నిబంధనలను వివరించి, మండలంలో వచ్చిన దరఖాస్తులను వారికి అందించారు. కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, ప్రకాశ్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకుల వారీగా దరఖాస్తుల పరిశీలన

కొందుర్గు: రాజీవ్ యువ వికాసం పథకం కింద ఇటీవల ఆన్‌లైన్ ద్వారా అందిన దరఖాస్తులను ఎంపీడీఓ లక్ష్మీఅనురాధ ఆధ్వర్యంలో మంగళవారం బ్యాంకర్లు పరిశీలించారు. బ్యాంకుల వారీగా దరఖాస్తులను విభజించి, జాబితాను బ్యాంకర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలోనే జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం ఉంటుందని, దరఖాస్తుదారుల పూర్తిడేటా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో మండల స్థాయి అన్ని బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక లాభాలు

రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త అలీబాబా



కనకమామిడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సమీర

మొయినాబాద్‌రూరల్: రైతులు పంటల సాగులో మెలకువలు పాటిస్తే లాభాలు పొందుతారని రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అలీబాబా(వ్యవసాయ ఆర్థిక శాస్త్రం), చిరంజీవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఆలీబాబా, చిరంజీవి, సమీర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధించే పంటలను సాగుచేయాలన్నారు. ముఖ్యంగా అవసరం మేరకే రసాయన ఎరువులను వినియోగించాలన్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువుల వినియోగంతో పంటలు, పొలంతో పాటు రైతులు అనారోగ్యాల బారినపడతారని వివరించారు. పంటల సాగులో డ్రిప్ సిస్టంతో నీటి వృథాను అరికట్టి భూగర్భజలాలను కాపాడుకోవాలని తెలిపారు. తరచూ పంట మార్పిడి చేయడంతో భూమి మరింత సారవంతంగా మారుతుందన్నారు. దుకాణాల్లో రైతులు కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రసీదులను పంటకాలం ముగిసే వరకు భద్రపర్చుకోవాలని సూచించారు. అనంతరం రైతులు పలు ప్రశ్నలు అడిగి శాస్త్రవేత్తల ద్వారా సమాధానాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సంధ్య, ఏఈఓ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణానికి కృషిచేయాలని వినతి



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న మైనార్టీ నాయకుడు ఎండీ జహంగీర్

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై రేతిబౌలి నుంచి పోలీస్ అకాడమీ వరకు ఫ్లైఓవర్ నిర్మాణానికి కృషి చేయాలని చేవెళ్లకు చెందిన మైనార్టీ నాయకుడు ఎండీ జహంగీర్ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కోరారు. మంగళవారం ఎంపీ నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మరోవైపు రోడ్డు విస్తరణ ఆలస్యమవుతుండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటం లేదన్నారు. హైదరాబాద్ నుంచి రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల మీదుగా కర్ణాటక వరకు ఉన్న ఈ రోడ్డుపై హైదరాబాద్ నగరం నుంచి బయటకు వెళ్లేందుకు తీవ్రమైన ట్రాఫిక్‌ను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దీనికి గాను హైదరాబాద్‌లో రేతిబౌలి నుంచి పోలీస్ అకాడమీ వరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిర్మాణం చేస్తే హైదరాబాద్‌లో ఉండే ట్రాఫిక్ సమస్య తీరుతుందని, నేరుగా రేతిబౌలి నుంచి పోలీస్ అకాడమీకి ట్రాఫిక్ సమస్య లేకుండా చేరుకొని అక్కడ నుంచి బీజాపూర్ హైవేపై మొయినాబాద్, చేవెళ్ల, మన్నెగూడ, వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్, కర్ణాటకకు వెళ్లే వారికి వీలుగా ఉంటుందని వివరించారు. దీనిపై ఎంపీ సానుకులంగా స్పందించి పరిశీలిస్తామని చెప్పారని వెల్లడించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాబాద్: షాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1989–1990 పదో తరగతి పూర్వ విద్యార్థులు మంగళవారం నందిగామ మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామ శివారులోని కో కో ఫామ్‌హౌస్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 36 ఏళ్ల తర్వాత అందరూ ఒక్కచోట కలిసి ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్నానాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు చెర్పిన ఉపాధ్యాయులు వీరస్వామిగౌడ్, యాదగిరాచారి, నర్సింహారావు, అడివప్ప, పురుషోత్తంను వేదికపైకి పిలిచి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నర్సింలు, శ్రీశైలం, జగదీశ్వర్‌రెడ్డి, మల్లయ్య, మదన్, శ్రీనివాస్, మంజుల, కుసుమకుమారి, అంజి, శివ, ఆంజనేయులు, రాములు, రమాదేవి తదితరులు ఉన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు నూతన వ్యవసాయ సాంకేతికతను అందించాలనే లక్ష్యంతో ఈ నెల 5 నుంచి 13 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు షాబాద్ వ్యవసాయ అధికారి వెంకటేశం పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఈ నెల 8వ తేదీన లక్ష్మారావుగూడ, సోలిపేట్, 16న తిమ్మారెడ్డిగూడ, మద్దూరు, 23న ఏట్ల ఎర్రవల్లి, హైతాబాద్, 30న మక్తగూడ, పెద్దవేడు, జూన్ 6న రేగడిదోస్వాడ, చందనవెళ్లి, 13న తిర్మలాపూర్, రుద్రారం గ్రామాల్లో అన్నదాతలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని శాస్త్రవేతలు ఇచ్చే సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని సూచించారు.

కులగణన దేశానికే ఆదర్శం

మాడ్గుల: రాష్ట్రంలో నిర్వహించిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధినేత రాహుల్‌గాంధీ నిర్వహించిన జోడో యాత్రలో కులగణన నిర్ణయం తీసుకున్నారని, ఇందులో భాగంగానే తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేపట్టారని పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించి అసెంబ్లీలో తీర్మానం చేయించారని తెలిపారు. అదేవిధంగా బీసీ రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేపట్టిన నేపథ్యంలో.. దేశ వ్యాప్తంగా కులగణన చేసేందుకు కేంద్రం నిర్ణయించిందని తెలిపారు. దీంతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.

అన్నదానం హర్షణీయం

ఆమనగల్లు: మార్కెట్‌యార్డులో ధాన్యం విక్రయించేందుకు వస్తున్న రైతులకు భోజన వసతి కల్పించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతుల సౌకర్యార్థం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత సొంత ఖర్చుతో మధ్యాహ్న భోజన వసతి కల్పించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం రైతులకు.. నాయకులు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, కడ్తాల్ అధ్యక్షుడు బిచ్యానాయక్, మార్కెట్ డైరెక్టర్లు శ్రీశైలం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

ఆమనగల్లు: ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన యాదీలాల్‌ను మంగళవారం కల్వకుర్తి అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కల్వకుర్తి అసోసియేషన్ సభ్యుడు జమీల్ అహ్మద్, కృష్ణయ్య, మల్లేశ్ యాదవ్, వెంకట్‌రెడ్డి, మల్లేశ్, ఆంజనేయులు, జంగయ్య, రాంపాల్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్, శ్రీకాంత్, రమణ, నాగరాజు, నరేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి



వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి

షాబాద్: వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేయడం అభినందనీయమని, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ నిరంతరం కృషి చేస్తోందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లి గ్రామంలో రూ.2 కోట్ల నిధులతో చేపట్టనున్న ఈసీ వాగు బ్రిడ్జి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించడానికి ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేస్తోందన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ వంతెన నిర్మాణంతో చుట్టూ పక్కన గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. పార్టీ కార్యకర్తలందరూ ఐక్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు కలిసి పనిచేస్తేనే విజయ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యకర్తల సమస్యలు తెలుసుకొని దశలవారీగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీరాంరెడ్డి, నర్సింలుగౌడ్, నాయకులు అమరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మద్దూరు కిష్టయ్య, శ్రీనివాస్, నర్సింలు, ప్రవీణ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

నిరుపేదల సంక్షేమమే బీజేపీ లక్ష్యం

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య



మాట్లాడుతున్న బాబయ్య తదితరులు

షాద్‌నగర్‌రూరల్: దేశంలోని నిరుపేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. పట్టణంలోని రేషన్ షాపులను పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్ ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గరీబ్ కళ్యాణ్ యోజన పథకం ద్వారా రేషన్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికి ఉచిత రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తుందన్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా పేదలకు సన్నబియ్యాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పేదల కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో అశోక్, విష్ణువర్ధన్‌రెడ్డి, కుర్మయ్య, రాము, శ్రీహరిగౌడ్, నర్సింహ, శ్రవణ్, శంకర్, మహేందర్, రవి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జాచేస్తే చర్యలు

తహసీల్దార్ గౌతమ్‌కుమార్

మొయినాబాద్: ప్రభుత్వ భూములు కబ్జాచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు, అజీజ్‌నగర్ రెవెన్యూలోని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మంగళవారం తొలగించారు. చిలుకూరులోని సర్వే నంబర్ 457 ప్రభుత్వ శిఖం భూమిలో అక్రమంగా షెడ్ నిర్మించారు. ఓ ప్రైవేటు ఫాంహౌస్‌కు ప్రభుత్వ భూమిలో నుంచి రోడ్డు వేశారు. అదే విధంగా అజీజ్‌నగర్ రెవెన్యూలోని సర్వే నంబర్ 49 ప్రభుత్వ భూమిలో రెండు ఇళ్లు నిర్మించారు. మంగళవారం రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలను జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. విలువైన ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జాచేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎక్కడ ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనా ప్రజలు రెవెన్యూ అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడుకోకపోతే భవిష్యత్తులో ప్రజల అవసరాలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాచేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు రోజ, రాజేశ్, సిబ్బంది బాలకృష్ణ, ఎల్లయ్య, భాస్కర్, వాటర్ వర్క్స్ సిబ్బంది రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ భూమిలో వేసిన రోడ్డును తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564